సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్‌పై సదస్సు నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహిస్తున్నారు. 'సంక్షోభంలో విశాఖ ఉక్కు – పరిష్కారం ఎలా ' అనే అంశంపై సాయంత్రం 5.30 గంటలకు ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివ సాగరరావు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సదస్సులో పాల్గొనున్నారు. సదస్సుకు ఉద్యోగులందరూ హాజరు కావాలని సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి కోరారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ నేడు

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో బుధవారం తిరుప్పావడ సేవ (అన్న కూటోత్సవం)ను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథరావు తెలిపారు. పులిహోరను రాశిగా పోసి, ప్రసన్న వేంకటేశ్వరుడికి నివేదించిన అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం రేపు

గాజువాక: గాజువాక జోన్‌లోని 64, 70, 73, 74, 76 వార్డులకు గురువారం నీటి సరఫరా ఉండదని వాటర్ సప్లై విభాగం సహాయ ఇంజినీర్ కేదార్‌నాథ్ తెలిపారు. సుందరయ్య కాలనీలోని 10 ఎంజీడీ నీటి శుద్ధి కర్మాగారంలో గురువారం నిర్వహణ పనులు చేపట్టనున్నామన్నారు. వాటర్ ప్లాంట్‌లోని ఫిల్టర్‌బెడ్లు, క్లారిఫ్లోక్యులేటర్, సంపులను శుభ్రపరచడంతో పాటు చిన్నచిన్న మరమ్మతు పనులను చేపడుతున్నందున ఆయా వార్డులకు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: పుట్టినరోజు సందర్భంగా పేదలకు సాయం చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సత్య హెల్త్ కేర్ జిమ్ అధినేత, ఆంధ్ర బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సవలాపురపు రాజారావు జన్మదినోత్సవం సందర్భంగా 74వ వార్డులో దయాల్ నగర్ గ్రామ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి చేతుల మీదుగా చిన్నారులకు మిఠాయిలు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనాథ బాలలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, ఎస్‌వై నాయుడు, గంట్యాడ గోవిందరాజు, సంపూర్ణం తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబరులో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఉచిత శిక్షణ, మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని సూచించారు.

రోగుల కష్టాలు.. మళ్లీ మొదలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు మొదలయ్యాయి. పీహెచ్‌సీల్లో వైద్యం పొందాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలను ఆధునికీకరించడంతో పాటు అదనంగా అర్బన్ పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచిన విషయం తెలిసిందే. దీంతో వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు ఆయా వైద్య నిపుణులు సేవలను అందించేవారు. ఇప్పుడు ఆ నిపుణులను ప్రస్తుత ప్రభుత్వం తొలగించడంతో రోగులకు ప్రభుత్వ వైద్యం అంతంత మాత్రమైపోయింది.

- ప్రభుత్వాస్పత్రుల్లో అంతంత మాత్రంగా సేవలు
- స్పెషలిస్టులను తొలగించిన ప్రభుత్వం
- ఒకే వైద్యుడితో సేవలు
- రోగుల పడిగాపులు

గాజువాక/అగనంపూడి/పెదగంట్యాడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అంతంతమాత్రంగా అందడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. గాజువాక నియోజకవర్గంలో గాజువాక, కణితి, పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు వాటి పరిధిలో 11 అర్బన్ పీహెచ్‌సీలున్నాయి. ఒక్కో ఆరోగ్య కేంద్రంలో రోజుకు 120 నుంచి 150 మంది ఔట్ పేషెంట్లు సేవలను పొందుతుంటారు. గతంలో ప్రతీ ఆరోగ్య కేంద్రంలో అక్కడి వైద్యాధికారితో పాటు స్పెషలిస్టు వైద్యుడి సేవలు అందేవి. ఇప్పుడు వారిని తొలగించడంతో ఆ భారం మొత్తం అక్కడి వైద్యాధికారిపై పడుతోంది. మొత్తం పేషంట్లను ఒకే వైద్యుడు చూసుకోవాల్సి వస్తుండటంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. స్పెషలిస్టు సేవలను పొందాల్సి వస్తే దూరంగా ఉన్న అగనంపూడి ప్రభుత్వాస్పత్రికి గాని, నగరంలో గల ప్రభుత్వాస్పత్రులకు గాని వెళ్లాల్సిందిగా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రోగులకు దూరాభారం అవుతోంది.



గాజువాక పీహెచ్‌సీలో నిరీక్షిస్తున్న రోగులు



ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు

అగనంపూడి లేదా సిటీకి వెళ్లమన్నారు



నా వయస్సు 87 సంవత్సరాలు. చెవిలో రంధ్రం పడింది. దీనికి మందులు వాడుతున్నాను. ఇప్పుడు నా సమస్యను చూడటానికి ఇక్కడ డాక్టర్ లేరని చెబుతున్నారు. అగనంపూడి గవర్నమెంట్ ఆస్పత్రికి గాని, సిటీలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి గాని వెళ్లమని చెబుతున్నారు. నాకు మోకాళ్ల నొప్పులు. నడవలేను. దీంతో ఏం చేయాలో తోచడం లేదు.

– ఎస్.సత్యనారాయణరాజు, శ్రీనగర్

రెండు గంటల నుంచి కూర్చున్నాను



నాకు కుడి చెయ్యి, కుడికాలు లాగేస్తున్నాయి. డాక్టర్‌కు చూపించుకుందామని వచ్చాను. రెండు గంటల నుంచి కూర్చున్నాను. జనం చాలా ఎక్కువగా ఉన్నారు. ఒకపక్క నొప్పి భరించలేకపోతున్నాను. డాక్టర్ చూసేలోపు నాకు ఏమవుతుందోననే భయం కూడా ఉంది.

– డి.నూకరాజు, శ్రీరామ్‌నగర్

డాక్టర్ రావడం లేదు



నేను కొద్ది రోజులుగా గొంతు నొప్పితో బాధపడుతున్నాను. మాట్లాడుతున్న, తింటున్నా నొప్పి ఎక్కువగా వచ్చేది. దగ్గరలోనే ఉన్న గంగవరం యూపీహెచ్‌సీలో ప్రతీ సోమవారం చెవి, ముక్కు గొంతు చూసే ప్రత్యేక డాక్టర్ వచ్చేవారు. ఆయనకు చూపించుకున్నాను. డాక్టర్ అన్ని పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. పూర్తిగా నయం అయ్యేవరకూ వారం వారం రమ్మన్నారు. అలా ప్రతీ సోమవారం వస్తున్నాను, ఇప్పుడిప్పుడే కొద్దిగా నయం అవుతోంది అనుకున్న సమయంలో డాక్టర్ రావడం లేదు, ఇక రారు అని చెప్తున్నారు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావట్లేదు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలంటే కూలిపనులు చేసుకుని బతికే మాలాంటి వారికి ఎంత కష్టం. చాలా ఇబ్బంది పడుతున్నా.

– సీహెచ్ రమణమ్మ, గంగవరం

అనకాపల్లి వెళ్లాల్సి వచ్చింది



మా బంధువుకు ఆరోగ్యం బాగా లేదు. వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిసిన వారు చెప్పడంతో లంకెలపాలెం యూపీహెచ్‌సీకి తీసుకువెళ్లాం. ఈ నెల మొదటి వారం నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు రావడం లేదని చెప్పడంతో అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాం. జనరల్ ఫిజీషియన్ కూడా అందుబాటులో లేకపోవడంతో మాతో పాటు వచ్చిన సాధారణ రోగులు కూడా ఇబ్బంది పడ్డారు.

–బి.పైడిరాజు, అగనంపూడి నిర్వాసిత కాలనీ

కాళ్ల నొప్పులతో బాధపడుతున్నా



నేను కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. సిద్ధేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతీ శుక్రవారం ఆర్థో డాక్టర్ వస్తున్నారని అందరూ చెప్పడంతో వెళ్లి చూపించుకున్నాను. డాక్టర్ గారు బాగా చూశారు. మంచి మందులు ఇచ్చారు. కాళ్ల నొప్పులు తగ్గుతున్నాయి. మళ్లీ చూపించుకుందామని వస్తే స్పెషలిస్ట్ డాక్టర్ రావడం లేదు. అందురూ చెబుతున్నారు ప్రభుత్వం మారింది.. స్పెషలిస్ట్ డాక్టర్లని ఆపేశారు అని. ఈ నొప్పులతో ఎక్కడో దూరంగా ఉన్న అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నాను. రెండు వారాల నుంచి మళ్లీ కాళ్ల నొప్పులు ఎక్కువయ్యాయి. ఈ బాధతో ఎంతదూరం వెళ్లగలను?

– ఎ.రాజ్యలక్ష్మి బాలచెరువు రోడ్డు

స్కిన్ స్పెషలిస్ట్ లేరు



నాకు భుజం, వీపుపై చాలా ఎక్కువగా దురద వస్తోంది. ఇక్కడ చర్మవ్యాధి డాక్టర్ ఉంటారని చెబితే వచ్చాను. ఇప్పుడు లేరని చెప్పారు. గతంలో ఉన్న డాక్టర్‌ను తీసేశారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్‌కు చూపించుకొని మందులు తీసుకుని వెళ్లిపోతున్నాను.

– పి.సత్యవతి, పాతగాజువాక

ప్రత్యేక సేవలు పునరుద్ధరించాలి



వారం రోజుల క్రితం మా పక్క ఇంట్లో ఉండే తాతగారికి ఆరోగ్యం బాగా లేదు. ఈఎన్‌టీ డాక్టర్ ఉంటారని చెప్పడంతో కణితి పీహెచ్‌సీకి తీసుకువెళ్లాం. తీరా అక్కడికి వెళ్లాక ఈఎన్‌టీ స్పెషలిస్ట్ రావడం లేదని చెప్పడంతో గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాం. వేలల్లో ఖర్చయింది. పేదలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వైద్యుల సేవలను పునరుద్ధరించాలి.

– ఎస్.నాయుడు, బీసీ కాలనీ

'అతిసార'పై అప్రమత్తత అవసరం



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు



అతిసారపై ప్రచారం చేస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: ప్రజలు అతిసార బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ సూచించారు. అతిసార వ్యాధి నివారణపై వార్డులోని చినగంట్యాడలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి పి.నాగఅప్పారావు, జీవీఎంసీ సీవో సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

పెదగంట్యాడ: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో డయేరియాపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో రట్టి వాసు, బైపిల్లి గాంధీ, సింగంపిల్లి దేముడు, రెయ్యి రత్న, కాకి స్వరూపారాణి, సమ్మిడి ఉమ, పోతిన వెంకటేశ్వరరావు, ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరీ ్ఎలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు



నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు

గాజువాక: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని గాజువాక ఎస్ఐ మన్మథరావు సూచించారు. స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు తమ శాఖలకు సంబంధించిన బ్యాడ్జిలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ నాయకులుగా ఎదగాలన్నారు. దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత మాట్లాడుతూ విద్యార్థి నాయకులుగా ఎన్నికైనవారి విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, జీఎం వసంత తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుకల పంపిణీపై ఆరా

తగరపువలస : భీమిలి మండల విద్యా శాఖ కార్యాలయాన్ని మంగళవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించి విద్యార్థుల కిట్లను పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశారా..? లేదా..? అని ఆరా తీసి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడుతూ కిట్లు పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు అర్థం చేసుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. జూనియర్ కళాశాలల్లో కూడా కిట్లు పంపిణీ చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు శివరాణి, జయప్రద, నోడల్ అధికారి అప్పలనాయుడు ఉన్నారు.

పద్మనాభం : మండల విద్యా శాఖ కార్యాలయాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ కాంప్లెక్సుల పరిధిలోని పాఠశాల నుంచి వచ్చిన స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. యూడైస్ ఎంత వరకు చేశారో కంప్యూటర్‌లో పరిశీలించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో అప్పలనాయుడు ఉన్నారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జగన్నాథుడి తిరుగు రథయాత్రను అగనంపూడిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామి వారిని కల్కి అవతారంలో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఇంద్రద్యుమ్న హాల్లో ఉన్న ఉత్సవమూర్తులను ఆలయ పూర్వీకులు, పండా కుటుంబీకులు గురు మోహన్, సంతోష్ రథంపైకి చేర్చిన అనంతరం తిరుగు రథయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయగా, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్, ఉత్సవ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, ప్రతినిధులు గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నాగమణి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, 'నాడు – నేడు' పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సుశీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

వేతన ఒప్పందం అమలుకు త్వరలో దీక్షలు



దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని, పోర్టులో ప్రైవేటీకరణ ఆపాలని ఈ నెల 25, 26 తేదీల్లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జె. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం సిటు కార్యాలయంలో పెండింగ్ సమస్యలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి అమలు చేయాల్సిన వేతన పెంపుదలకు సంబంధించి చర్చలకు పిలవలేదన్నారు. వేతన ఒప్పంద కాలం ముగిసి ఇప్పటికి 30 నెలలు పూర్తయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపీఏ దుర్మార్గమైన షరతులు విధించి కాలయాపన చేస్తుందన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: విశాఖ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా..

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 24 కిలోల గంజాయిని తమిళనాడుకు చెందిన ప్రేమనిసార్, శిశురాజులు కొనుగోలు చేసి సోమవారం రాత్రి రెండు బ్యాగులతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫోర్తుటౌన్ పోలీసులు వారిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి తేస్తే నగదు ఇస్తానని తమిళనాడుకు చెందిన రియాజ్ అనడంతో అరకు వచ్చి గొనుగోలు చేశామని నిందితులు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నగర శివారులో 'మత్తు' వాసన

- ఆనందపురం – అనకాపల్లి బైపాస్ మీదుగా అక్రమ రవాణా
- స్మగ్లర్లకు నెలవుగా మారుతున్న జనావాసాలు

పెందుర్తి : ప్రశాంతంగా ఉన్న నగర శివారులో అడపాదడపా ఆర్థిక నేరాలు, దొంగతనాలు జరగడం పరిపాటి. ఈ క్రమంలో మరోసారి పెందుర్తి ప్రాంతం ఊహించని ఘటనలకు నిలయంగా మారింది. నగర శివారులో చెన్నై – కోల్‌కతా హైవేపై మత్తు పదార్థాల వాసన గుప్పుమంటోంది.ఆనందపురం – అనకాపల్లి బైపాస్ రహదారి కేంద్రంగా గంజాయి, గుట్కా, ఇతర నిషేధిత మత్తు పదార్థా లను అక్రమంగా ఎగుమతి, దిగుమతి చేయడం కలకలం రేపుతోంది. ఈ అక్రమ వ్యాపారంలో ఏజెన్సీ వాసులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు పట్టుబడుతున్నారు. రవాణాకు వీలుగా ఈ రహదారికి సమీపంలోనే మత్తు పదార్థాల నిల్వకు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సమయం చూసుకుని పోలీసుల కళ్లుగప్పి నగరంలోకి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



పెందుర్తి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్న గంజాయి

సులభంగా అక్రమ రవాణా

ఆనందపురం – అనకాపల్లి జాతీయ రహదారి (బైపాస్) పెందుర్తి నుంచి వెళ్లడంతో గంజాయితోపాటు ఇతర వస్తువుల అక్రమ రవాణాకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా గంజాయిని ఏజెన్సీ నుంచి పెందుర్తికి తీసుకొచ్చి ఇక్కడి నుంచి తూకాలు వేసి స్మగ్లర్లు అవసరమైన వారికి రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచే గంజాయి తరలిపోతున్నట్లు తెలుస్తోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై తనిఖీలు జరుగుతున్నా స్మగ్లర్లు తమదైనశైలిలో అధికారులను బురిడీ కొట్టించి సరకును తరలించుకుపోతున్నారు. ఇందుకు పర్యాటక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల స్టిక్కర్లు వాహనాలపై అతికిస్తుండడం గమనార్హం.

నివాసాల మధ్యలోనే నిల్వచేసి..

పెందుర్తి ప్రాంతంలో సుజాతనగర్ అంటే పూర్తిగా క్లాస్ ప్రాంతం. కానీ ఇక్కడ ఐదేళ్ల క్రితం జరిగిన దాడిలో ఓ ఇంట్లో 410 కిలోల గంజాయి దొరికింది. కొన్నాళ్ల క్రితం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గంజాయితోపాటు నలుగురు తమిళ స్మగ్లర్లు, ఇద్దరు ఏజెన్సీ వాసులు పట్టుబడ్డారు. ఆ తర్వాత పలుమార్లు స్మగ్లర్లు పోలీసులకు చిక్కారు. తాజాగా పెందుర్తికి ఆనుకుని ఉన్న పులగాలిపాలెంలో ఓ అధునాతన భవనంలో నిల్వ ఉన్న 75 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆయా ఇళ్లల్లో దొరికిన వారు దీర్ఘకాలికంగా అద్దె ఇళ్లల్లో ఉండడం చూస్తుంటే ఎన్ని లక్షల కిలోల గంజాయి ఇక్కడి నుంచి సరఫరా చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.